సాక్షి

అల్లూరి సీతారామరాజు జిల్లా

సోమవారం । 14 । ఆగస్టు । 2023



జాతీయ జెండాలతో బైక్ ర్యాలీ

ఒనకఢిల్లీలో బీఎస్ఎఫ్ 65 బెటాలియన్ ఆధ్వర్యంలో బీఎస్ఎఫ్ పోలీసులు జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. 8లో



పోలింగ్ కేంద్రాలు పెరిగే అవకాశం

మన్యంలో దూరాన్ని తగ్గించేలా పోలింగ్ కేంద్రాల సంఖ్య పెంపునకు ప్రతిపాదిస్తామని జేసీ శివశ్రీనివాస్ వెల్లడించారు. 8లో



వ్యాధి నిర్ధారణ సులభతరం 9లో

ప్రభుత్వం ఏర్పాటుచేసిన అగ్రి ల్యాబ్‌లో పశుసంవర్ధక విభాగం సేవలు పెంపకం దారులకు ఎంతో మేలు చేకూర్చుతున్నాయి.

న్యూస్‌రీల్

16న పాడేరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమావేశం

సాక్షి,పాడేరు: వైఎస్సార్‌సీపీ పాడేరు నియోజకవర్గ సమావేశాన్ని ఈనెల 16వ తేదీన నిర్వహిస్తున్నామని ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి ఆదివారం తెలిపారు. ఈ సమావేశానికి వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి హాజరవుతారని ఆమె పేర్కొన్నారు. పాడేరులో ఎస్పీ కార్యాలయం రోడ్డులోని వీఆర్ కల్యాణ మండపంలో బుధవారం ఉదయం 10 గంటలకు సమావేశం జరుగుతుందని ఆమె పేర్కొన్నారు. రాష్ట్ర ట్రైకార్ చైర్మన్, డైరెక్టర్లు, ఏఎంసీ చైర్మన్, డైరెక్టర్లు, పాడేరు, జి.మాడుగుల, చింతపల్లి, కొయ్యూరు, జీకేవీధి మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీలు, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, మండల కన్వీనర్లు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు, గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆమె కోరారు.

'కొత్తపల్లి'లో సండే సందడి



కొత్తపల్లి జలపాతం వద్ద సందడి చేస్తున్న పర్యాటకులు

జి.మాడుగుల: కొత్తపల్లి జలపాతం వద్ద ఆదివారం సందడి నెలకొంది. ప్రభుత్వ, ప్రయివేటు కార్యాలయాలకు, విద్యాసంస్థలకు ఆదివారం సెలవు కావడంతో పలు ప్రాంతాల నుంచి ప్రత్యేక వాహనాల్లో భారీగా తరలివచ్చారు. జలపాతంలో స్నానాలు చేస్తూ ఉత్సాహంగా గడిపారు.

బొర్రాకు భారీగా పర్యాటకులు

- రెండు రోజుల్లో 6.5 లక్షల ఆదాయం



బొర్రా గుహలను తిలకిస్తున్న పర్యాటకులు

అనంతగిరి: మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రాగుహలకు శని, ఆదివారాల్లో పర్యాటకులు పోటెత్తారు. రెండు రోజులు సెలవులు కావడంతో మన్యం అందాలను తిలకించేందుకు పర్యాటకులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. బొర్రాగుహలను శనివారం మూడు వేల మంది తిలకించగా రూ.2.5 లక్షలు, ఆదివారం ఐదు వేల మంది తిలకించగా రూ.4 లక్షల ఆదాయం వచ్చిందని మేనేజర్ గౌరీ శంకర్ తెలిపారు. సందర్శిత ప్రాంతాలన్నీ రెండు రోజులు కళకళలాడాయి. కటికి, తాటిగుడ, సరియా, చిట్టంపాడు జలపాతాలు, కాఫీ ప్లాంటేషన్, డముకు వ్యూపాయింట్ పర్యాటకులు రాకతో సందడిగా మారింది.

భార్యను హతమార్చిన భర్త


- కర్రతో పొట్టపై కొట్టడంతో తీవ్రంగా గాయపడి మృతి



ఛిత్రో మృతదేహం

సాక్షి, పాడేరు: మండలంలోని మారుమూల అయినాడ పంచాయతీ పెద్ద పాలెం గ్రామంలో శనివారం రాత్రి కట్టుకున్న భార్యను భర్త కడతేర్చిన సంఘటన చోటు చేసుకుంది. మారుమూల గ్రామం కావడంతో ఈ హత్య ఆలస్యంగా వెలుగు చూసింది. భార్యాభర్తలైన తమర్ల బాలరాజు, తమర్ల ఛిత్రోల మధ్య శనివారం రాత్రి తొమ్మిది గంటల సమయంలో గొడవ జరిగింది. వెంటనే బాలరాజు భార్య తమర్ల ఛిత్రో (30) పొట్టపై కర్రతో తీవ్రంగా కొట్టాడు. అప్పటికే ఆమె పొట్టలో కాయతో బాధపడుతోంది. అక్కడ కొడితే చనిపోతుందని భావించిన బాలరాజు కర్రతో బలంగా కొట్టాడు. దీంతో నొప్పితో బాధపడుతూ ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న మృతురాలి అన్న పాడేరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వెంటనే వారు క్లూస్ టీంతో హుటాహుటిన ఆదివారం మధ్యాహ్నం సంఘటన స్థలానికి వెళ్లారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బాలరాజు, ఛిత్రోకు ముగ్గురు సంతానం ఉన్నారు.

పురాతన కెమెరాల ప్రదర్శన



బీచ్‌రోడ్డు: 19వ శతాబ్దం నాటి కెమెరాలు, జేమ్స్‌బాండ్ చిత్రాల్లోని స్పై కెమెరాలను ఎప్పుడైనా చూశారా? చూడని వారి కోసం విజయనగరానికి చెందిన సి.జె.నెహ్రూ తను సేకరించిన కెమెరాలతో ప్రదర్శన ఏర్పాటు చేశారు. హవామహల్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శనకు విశేష స్పందన లభించింది.

కొరమీను గలగల

మన్యం మత్స్యసిరులకు నిలయంగా మారనుంది. ఇప్పటివరకు సాధారణ రకాల చేపల పెంపకాన్ని చేపట్టిన గిరిజన మత్స్యకారులు ఇకనుంచి కొరమీనుల పెంపకం చేపట్టనున్నారు. ఇందుకు మన్యం వాతావరణ పరిస్థితులు అనుకూలమని గుర్తించిన పందిరిమామిడి కృషివిజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు ఈ దిశగా ప్రోత్సహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.



పందిరిమామిడి కృషి విజ్ఞాన కేంద్రంలో ప్రయోగాత్మకంగా పెంచిన కొరమేను చేపలు



బందపల్లిలో రైతు పెంచిన కొరమేను

- పెంపకానికి మన్యం అనుకూలం
- పందిరిమామిడి కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో గిరి రైతులకు ప్రోత్సాహం
- కొరమీను పిల్లలను సిద్ధం చేస్తున్న శాస్త్రవేత్తలు

రంపచోడవరం: కొరమీను పెంపకానికి మన్యం ప్రాంతం అనుకూలమని పందిరిమామిడి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు సిఫార్సు చేస్తున్నారు. వీటిని ఆంధ్రా ఫిష్ అని కూడా పిలుస్తుంటారు. ఈ రకం చేపల పెంపకాన్ని ప్రోత్సహించేందుకు వారు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే రాయపల్లి, రాజంపల్లి, బందపల్లి, పెద్దగెద్దాడ గ్రామాల్లో ప్రయోగాత్మకంగా కొరమీను పెంపకం చేపట్టారు. మంచి దిగుబడి రావడంతో గిరిజన రైతులతో వీటి పెంపకం చేపట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మంచినీటి చేపల పెంపకాన్ని చేపట్టిన గిరిజన మత్స్యకారులకు కొరమీను చేప పిల్లలను (సీడ్) అందజేశారు.

ఈ ఏడాది 50 ఎకరాల్లో పెంపకం

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సుమారు 50 ఎకరాల చెరువుల్లో కొరమేను చేపల పెంపకం చేపట్టాలని పందిరిమామిడి కృషి విజ్ఞాన కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. దీనిలో భాగంగా ఐదు నుంచి ఆరు అంగుళాల సైజు కొరమీను చేప పిల్లలను సిద్ధం చేసింది.

- కొరమీను పెంపకానికి నల్లరేగడి, బంకమన్ను, బురద నేలలు అనువుగా ఉంటాయి. ఎకరా విస్తీర్ణం చెరువులో ఎనిమిది నుంచి పది వేల చేపపిల్లల పెంపకం చేపట్టవచ్చు.
- కొరమీను రకం చేపలు మొండి జాతికావడం వల్ల 90 శాతం పిల్లలు బతుకుతాయి. ఏజెన్సీ ప్రాంతంలోని చెరువులు లోతు తక్కువగా ఉంటాయి. నీరు కూడా తక్కువ కాలం ఉన్నందున కొరమీనుల పెంపకానికి అనుకూలం. సహజ సిద్ధంగా ఉంటే చిరు చేపలను, నేలలోని అధిక ప్రొటీన్ ఉండే మేతను తీసుకుంటాయి.
- వీటికి వ్యాధులు కూడా చాలా తక్కువ వస్తాయి. ఎకరానికి 4 నుంచి 5 టన్నులు దిగుబడి వస్తుంది. మార్కెట్‌లో కేజీ కొరమీను రూ. 400 వరకు ధర ఉంది. ఎకరానికి రూ. ఆరు లక్షల నుంచి రూ.8 లక్షల వరకు ఆదాయం వస్తుందని పందిరిమామిడి కృషి విజ్ఞాన కేంద్రం మత్స్యవిభాగం శాస్త్రవేత్తలు వెల్లడించారు.

ఆరోగ్యపరంగా..

చికెన్, మటన్‌తో పోలిస్తే కొర్రమేను చేపలో అల్బుమిన్ ప్రొటీన్ శాతం ఎక్కువ ఉంటుంది. గాయం తగిలినప్పుడు వీటిని ఆహారంగా తీసుకుంటే వేగంగా తగ్గుముఖం పడతాయి. ఈ రకం చేపలను తరచూ ఆహారంగా తీసుకుంటే శరీరంలో చక్కెర శాతాన్ని అదుపులో ఉంచుతుంది. శరీరంలోని రక్త ప్రసరణను మెరుగుపరుస్తాయి.

నెలాఖరుకు పంపిణీ పూర్తి



ఏజెన్సీలో గిరిజన రైతులకు కొరమీను చేప పిల్లల పంపిణీ ఆగస్టు నెలాఖరుకు పూర్తి చేస్తాం. అయితే ఏజెన్సీలో ఇప్పటి వరకు కొర్రమేను చేపల పెంపకం చేపట్టలేదు. ప్రభుత్వ ప్రోత్సాహంతో చేప పెంపకాన్ని ఏజెన్సీలో అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం. కృషి విజ్ఞాన కేంద్రంలో ఏడాది పాటు శ్రమించి నాలుగు ట్యాంకుల్లో చేప పిల్లలను సిద్ధం చేస్తున్నాం.

–వీరాంజనేయులు, మత్స్యశాఖ సీనియర్ శాస్త్రవేత్త, కృషి విజ్ఞాన కేంద్రం, పందిరిమామిడి

అల్లూరి స్మారక ప్రాంతాలకు మహర్దశ

- మంపలో కొలను, స్మారక స్థూపం సుందరీకరణ
- రాజేంద్రపాలెంలో పార్కు అభివృద్ధి
- మ్యూజియంగా చింతపల్లి పాత పోలీసుస్టేషన్
- క్షత్రియ సేవా సమితి నిధులతో పనులు



ఏర్పాటుచేస్తున్న అల్లూరి స్మారక స్థూపం



ఆధునికీకరించనున్న కొలను

కొయ్యూరు: పర్యాటకులను ఆకర్షించేలా అల్లూరి స్మారక మందిరాలను అభివృద్ధి చేసేందుకు కార్యాచరణ రూపొందించారు. ఇందుకు అవసరమైన నిధులను క్షత్రియ సేవా సమితి వెచ్చిస్తోంది.

- మంపలో స్మారక మందిరం, అదే ప్రాంతంలో కొలనును ఆధునికీకరిస్తారు. పర్యాటకులు ఉండేందుకు అనువుగా వసతి కల్పిస్తారు. ముందుగా కొలను ఆధునీకరణ పనులు ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. దీనిలో భాగంగా ఇప్పటికే నీటిని తొలగించారు. ఇదే ప్రాంతంలో పాత స్మారక స్థూపం స్థానంలో కొత్త స్థూపాన్ని సిద్ధం చేస్తున్నారు. దీనిపై అల్లూరి సంబంధించి పూర్తి వివరాలను ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు.
- అల్లూరికి సంబంధించిన వివిధ ఆకృతులను ఏర్పాటుచేయడంతో పాటు జీవిత చరిత్రను బొమ్మల రూపంలో గోడలపై ఏర్పాటుచేయనున్నారు. రాజేంద్రపాలెం పార్కులో అల్లూరిని చంపిన సన్నివేశాన్ని కళ్లకుకట్టినట్టు చూపే ఆకృతి ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. ఇదే ప్రాంతాన్ని పిల్లల పార్కుగా తీర్చిదిద్దనున్నారు.

మ్యూజియంగా చింతపల్లి పాత పోలీసుస్టేషన్

చింతపల్లి పోలీసుస్టేషన్‌పై 1922 ఆగస్టులో అల్లూరి తన అనుచరులతో కలిసి దాడి చేశారు.ఈ నేపథ్యంలో దానిని మ్యూజియంగా అభివృద్ధి చేయనున్నారు. సుందరీకరణ పనులు చేపట్టిన కాంట్రాక్టర్ రాజ్‌కుమార్ ఈ సందర్భంగా మాట్లాడుతూ మ్యూజియంను పూర్తి చేసిన తరువాత అప్పట్లో వారు ఉపయోగించిన కొన్ని రకాల ఆయుధాలను కూడా సేకరించి ఉంచుతామన్నారు. నర్సీపట్నంలో బ్రిటీష్ అధికారుల సమాధులను కూడా అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఇందుకు సంబంధించి క్షత్రియ సేవా సమితి నిధులను వెచ్చిస్తోందని ఆయన వివరించారు.

ఒకరి దానం.. మరొకరికి ప్రాణం

- 16 ఏళ్ల చిన్నారికి గుండె మార్పిడి చేసిన ఘనత రాష్ట్ర ప్రభుత్వానిదే..
- ఇందుకు రూ.కోటి ఖర్చు చేసింది
- అవయవదానంపై మరింత అవగాహన పెరగాలి
- కలెక్టర్ మల్లికార్జున
- అవయవదాతల కుటుంబ సభ్యులకు సత్కారం

బీచ్‌రోడ్డు: వైద్య రంగానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యమిస్తున్నారని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున అన్నారు. ప్రపంచ అవయవదాన దినోత్సవం సందర్భంగా సిరిపురంలోని గురజాడ కళాక్షేత్రంలో అవయవదానం చేసిన వారి కుటుంబ సభ్యులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హార్ట్ ఫెయిల్యూర్‌తో బాధపడుతున్న 16 ఏళ్ల చిన్నారికి జీవన్‌దాన్ ద్వారా గుండె మార్పిడి చేసిన ఘనత రాష్ట్ర ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం సుమారు కోటి రూపాయలు ఖర్చు చేసిందన్నారు. అవయవదానంపై మూడేళ్లుగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని.. మరింతగా ప్రచారం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఏటా 5 లక్షల మంది అవయవాలు వైఫల్యం చెందుతున్నాయని చెప్పారు. వారిలో కేవలం 10 శాతం మంది వైద్యం చేసుకుని జీవించగలుగుతున్నారని.. మిగిలిన వారు మరణిస్తున్నారని తెలిపారు. ఈ వ్యత్యాసాన్ని తగ్గించాలంటే ప్రజలు అవయవదానం చేసేందుకు ముందుకు రావాలన్నారు. అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో బ్రెయిన్‌డెడ్ అయిన వ్యక్తుల నుంచి అవయవాలు సేకరించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. అవయవదానం చేసిన కుటుంబ సభ్యుల వైద్య ఖర్చుల్లో 50 శాతం రాయితీని ప్రకటించిన కిమ్స్ ఐకాన్ ఆస్పత్రి యాజమాన్యాన్ని అభినందించారు. ఈ సందర్భంగా అవయవదానం ప్రతిజ్ఞ ఫ్లెక్సీపై సంతకం చేశారు.

తొలి ప్రభుత్వ ఆస్పత్రి విమ్స్

బ్రెయిన్‌డెడ్ అయిన వ్యక్తి నుంచి అవయవాలను సేకరించిన రాష్ట్రంలోనే మొదటి ప్రభుత్వ ఆస్పత్రి విమ్స్ అని జీవన్‌దాన్ రాష్ట్ర కో–ఆర్డినేటర్, విమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాంబాబు అన్నారు. ఇప్పటి వరకు విమ్స్‌లో ఇద్దరి నుంచి అవయవాలను సేకరించినట్లు వెల్లడించారు. అవయవదానంపై ప్రజల్లో చాలా సందేహాలు, అపోహలు ఉన్నాయని.. వాటిని విడిచి పెట్టాలని సూచించారు. అవయవాలు దానం చేసేందుకు ప్రజలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కేవలం మన రాష్ట్రంలోనే అవయవాల కోసం 3 వేల మంది పేర్లు నమోదు చేసుకున్నారని, పేర్లు నమోదు చేసుకోని వారి సంఖ్య వేలల్లో ఉంటుందన్నారు. కార్యక్రమంలో భాగంగా అవయవదానం చేసిన 15 మంది కుటుంబ సభ్యులను ఘనంగా సత్కరించారు. రెడ్‌క్రాస్ సంస్థల రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ శివ నాగేందర్‌రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు, విమ్స్ ఆస్పత్రి వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, పలు కళాశాలలకు చెందిన వైద్య విద్యార్థులు, ఎన్జీవోలు, రెడ్‌క్రాస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆపదలో అండగా..

- ముఖ్యమంత్రి జగన్ హామీతో చిన్నారి తల్లి ఖాతాలో రూ.లక్ష జమ
- బాధిత కుటుంబంలో ఆనందం



కాన్వాయ్ ఆపి పాప ఆరోగ్యపరిస్థితిని అడిగి తెలుసుకుంటున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి

కూనవరం : అనారోగ్యంతో బాధపడుతున్న చిన్నారి కుటుంబానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన భరోసా మేరకు వారి ఖాతాలో రూ.లక్ష జమకావడంతో ఆ కుటుంబంలో ఆనందం నెలకొంది. వివరాలిలా ఉన్నాయి. వరద బాధితులను పరామర్శించేందుకు ఇటీవల కూనవరం గ్రామానికి వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధితుల సమస్యలు తెలుసుకుని భరోసా ఇచ్చారు. తిరిగి బస్సులో కోతుల గుట్ట హెలిప్యాడ్‌కు బయలుదేరారు. అప్పటికే ఆయనను కలిసేందుకు స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమీపంలో చిన్నారి శివచంద్రికతో టేకులబోరుకు చెందిన తల్లిదండ్రులు వేముల నాగమణి, సతీష్ దంపతులు వేచి ఉన్నారు. వీరిని చూసిన సీఎం జగన్ వెంటనే కాన్వాయ్‌ను ఆపారు. వాహనం దిగి నేరుగా వారి వద్దకు వెళ్లి సమస్యను తెలుసుకున్నారు. చిన్నారి శివచంద్రిక రెండేళ్ల క్రితం మెట్లపై నుంచి జారిపడటంతో కాలర్ బోన్ విరిగిపోయిందని దంపతులు వివరించారు. అప్పటినుంచి ఆమె శారీరక పెరుగుదల సరిగ్గా లేదని...ఆరోగ్య పరిస్థితులను ముఖ్యమంత్రికి వారు వివరించారు. ఇప్పటివరకు రూ.లక్ష ఖర్చుపెట్టామని.. చాలా ఆస్పత్రుల్లో చూపించినా ఫలితం లేకుండా పోయిందని వారు వాపోయారు. వెంటనే స్పందించిన ముఖ్యమంత్రి మీ పాపకు అయ్యే వైద్యం ఖర్చులు మొత్తం ప్రభుత్వం భరిస్తుందని హామీ ఇచ్చారు. ఇప్పటి వరకు చిన్నారి వైద్యానికి ఖర్చుపెట్టిన రూ.లక్ష ఇస్తామని ఆయన ప్రకటించారు. ఆ మొత్తం రెండు రోజుల్లోనే తల్లి ఖాతాలో జమచేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను ఆదేశించారు. ఈమేరకు శనివారం ఆమె తల్లి ఖాతాలో రూ.లక్ష జమ అయింది. చిన్నారి శివచంద్రికకు సంబంధించిన రిపోర్టులన్నింటిని అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌వో పి.పుల్లయ్య ద్వారా కలెక్టర్‌కు పంపించామని తల్లిదండ్రులు నాగమణి, సతీష్ తెలిపారు. భగవంతుడు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రూపంలో మా కుటుంబాన్ని ఆదుకున్నారని వారు సంతోషం వ్యక్తం చేశారు.

నేటితో ముగియనున్న పాలిసెట్ ఆప్షన్ల గడువు

మురళీనగర్: పాలిటెక్నిక్ కాలేజీల్లో ప్రవేశానికి సంబంధించి వెబ్ ఆప్షన్ల గడువు సోమవారంతో ముగుయనుంది. దీంతో విద్యార్థులు ఆప్షన్ల ఎంపికతోపాటు వెబ్‌సైట్‌లో ఏర్పడుతున్న పలు సమస్యల పరిష్కారానికి హెల్ప్‌లైన్ కేంద్రాలను ఆశ్రయిస్తున్నారు. గత మూడు రోజులుగా కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ, ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ (గైస్)లో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ కేంద్రాల్లో అధికారులను సంప్రదించి లాగిన్, పాస్‌వర్డ్ క్రియేషన్ వంటి సమస్యలను పరిష్కరించుకున్నారు. ఆదివారం కూడా వీరు హెల్ప్‌లైన్ కేంద్రాలకు వచ్చి స్థానిక సిబ్బంది సహకారంతో వెబ్ ఆప్షన్లు పెట్టుకున్నారు. ఆప్షన్ల ఎంపిక సోమవారంతో ముగియనుండగా 16న ఆప్షన్లు మార్పిడి చేసుకునే అవకాశం ఉంది. ఈనెల 18న సీట్లు కేటాయిస్తారు. ఈనెల 19 నుంచి 23 వరకు కాలేజీల్లో చేరడానికి అవకాశం ఉంది.

విహారంలో విషాదం

విహారయాత్ర వారి పాలిట విషాదంగా మారింది. సరదాగా గడిపేందుకు స్నేహితులతో జలపాతాల వద్దకు వచ్చిన వారిలో ముగ్గురిని వాగు రూపంలో మృత్యువు పొట్టనపెట్టుకుంది. వాగులో పడిన స్నేహితుడిని కాపాడిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి కాలుజారి జలపాతంలో పడి మృతిచెందాడు. మారేడుమిల్లి మండలంలోని వాలుమూరు వాగు ఊబిలో చిక్కుకుని మరో ఇద్దరు మృతి చెందారు.

- వాగు రూపంలో కబళించిన మృత్యువు
- వేర్వేరు ఘటనల్లో ముగ్గురి మృతి



మృతదేహాన్ని బయటకు తీసుకువస్తున్న పోలీసులు



వాలమూరు కొండ వాగులోంచి మృతదేహాలను తీసుకువస్తున్న స్నేహితులు

మోతుగూడెం : పొల్లూరు జలపాతం వద్ద వాగులో పడిన స్నేహితుడిని రక్షించాడు. ఈ ప్రయత్నంలో ఓ యువకుడు ప్రమాదానికి గురై మృతి చెందాడు. హైదరాబాద్‌లోని టీసీఎస్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్న కాజా హేమంత్ (24) రెండు రోజులు సెలవులు కావడంతో రాజమహేంద్రవరంలోని ఇంటికి వచ్చాడు. విహారయాత్రలో భాగంగా 14 మంది స్నేహితులతో కలిసి ఆదివారం ఉదయం పది గంటలకు పొల్లూరు వచ్చాడు. వీరంతా ఇక్కడికి సమీపంలోని జలపాతానికి ఎగువున ఉన్న తడికవాగు వద్దకు వెళ్లారు. వీరిలో ఒకరు వాగులోకి దిగుతుండగా జారిపడిపోవడంతో అతనిని బయటకు తీసి హేమంత్ రక్షించాడు. ఈ సమయంలో కాలు జారి ప్రమాదానికి గురై మునిగిపోయాడు. అతనిని కాపాడేందుకు స్నేహితులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ప్రమాద సమాచారం తెలుసుకున్న మోతుగూడెం ఎస్‌ఐ గోపాలరావు సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని బయటకు తీయించి పోస్టుమార్టం నిమిత్తం చింతూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. గత పదేళ్లలో ఈ ప్రాంతంలో సుమారు 25 మంది ప్రమాదానికి గురై ప్రాణాలు కోల్పోయినట్టు పోలీసులు తెలిపారు.

వాలమూరు వాగు ఊబిలో చిక్కుకుని ఇద్దరు..


మారేడుమిల్లి : తూర్పుగోదావరి జిల్లా ముమ్మిడివరం మండలం క్రాఫ్ చింతలపూడి గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ మదాల సురేష్ (40), కలిదిండి తేజస్వీవర్మ (28), మరో ఏడుగురు స్నేహితులు కారులో విహారయాత్రలో భాగంగా ఆదివారం మారేడుమిల్లి వచ్చారు. జలతరంగిణి జలపాతాన్ని సందర్శించారు. అనంతరం వాలమూరు గ్రామ సమీపంలోని కొండ వాగులో స్నానానికి దిగారు. ఇందులో సురేష్, తేజస్వీవర్మ వాగులోని ఊబిలో చిక్కుకుపోయారు. అపస్మారకస్థితిలో ఉన్న వారిని స్నేహితులు బయటకు తీసుకువచ్చారు. అక్కడనుంచి వారిని కారులో రంపచోడవరం ఏరియా ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అయితే వారు అప్పటికే మృతి చెందారు. విషయం తెనుకున్న పోలీసులు రంపచోడవరం ఆస్పత్రికి వెళ్లి వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హ్యాపీ బర్త్‌డే పీచెస్



విద్యార్థులతో కలసి కేక్ కట్ చేస్తున్న జూ క్యూరేటర్ నందనీ సలారియా

- జూలో ఘనంగా ఆడ తెల్లపులి పుట్టిన రోజు వేడుక



ఆరిలోవ: ఇందిరా గాంధీ జూ పార్కులో పీచెస్ అనే ఆడ తెల్ల పులి పుట్టిన రోజు ఘనంగా జరిగింది. తెల్ల పులుల ఎన్‌క్లోజర్ వద్ద ఆదివారం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో సీపీఈ జూనియర్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. కొందరు విద్యార్థులు పులి మాస్కులు ధరించి సందడి చేశారు. విద్యార్థులతో కలిసి క్యూరేటర్ నందనీ సలారియా కేకు కట్ చేసి సందర్శకులకు పంచిపెట్టారు. సీపీఈ కళాశాల యాజమాన్యం ఆ పులిని నెల రోజుల పాటు దత్తత తీసుకుంది. పీచెస్ పుట్టి ఐదేళ్లు పూర్తయిందని, ఆరో సంవత్సరంలోకి అడుగుపెట్టిన సందర్భంగా పుట్టిన రోజు వేడుక నిర్వహించామని క్యూరేటర్ తెలిపారు. నెల రోజుల పాటు పీచెస్‌కు అయ్యే ఖర్చును భరించేందుకు ముందుకొచ్చిన సీపీఈ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. అసిస్టెంట్ క్యూరేటర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సిరుల రాజ్‌మా

- ఒకపక్క మార్కెట్లో డిమాండ్
- మరోపక్క ప్రభుత్వ ప్రోత్సాహం
- 90 శాతం రాయితీపై విత్తనాల పంపిణీ
- సేంద్రియ విధానంలో పండిస్తున్న రైతులు
- మెరుగైన ఆదాయం



రాజ్‌మా విత్తనాలు

సాక్షి,పాడేరు : ఒకపక్క మార్కెట్లో డిమాండ్.. మరోపక్క ప్రభుత్వ ప్రోత్సాహం.. అంతకుమించి ఏ రైతుకైనా ఇంకేకావాలి.. ఇవే రాజ్‌మా సాగుకు కలిసొచ్చాయి. గిరి రైతుల ఆర్థిక పరిస్థితికి దోహదపడుతున్నాయి. సేంద్రియ విధానంలో పండిస్తున్నందున వినియోగదారులు పోటీపడి కొనుగోలు చేస్తుండటంతో వారిని లాభాల సిరులు వరిస్తున్నాయి.

పాడేరు డివిజన్‌లో..

పాడేరు డివిజన్‌లోని 11 మండలాల్లో విస్తారంగా సాగు చేస్తున్నారు. ఈ ఏడాది పదివేల ఎకరాల్లో సాగు చేసేందుకు 90 శాతం రాయితీపై ప్రభుత్వం 4,553 క్వింటాళ్ల విత్తనాలను అందుబాటులోకి తెచ్చింది.ఏటా క్రిస్మస్, సంక్రాంతి పండగల నాటికి గిరి రైతులకు పంట చేతికందుతుంది. ఈనెల మూడవ వారం, వచ్చేనెల మొదటి వారాల్లో మెట్ట, కొండపోడు భూముల్లో సాగుకు రైతులు శ్రీకారం చుడతారు. డిసెంబర్ మొదటి, రెండవ వారాల నాటికి దిగుబడికి వస్తుంది.

ముందస్తుగానే సరఫరా..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి 90 శాతం రాయితీపై ముందస్తుగానే విత్తనాలు పంపిణీ చేస్తోంది. కిలో అసలు ధర రూ.154 కాగా ప్రభుత్వం రూ.138.60 రాయితీపై రూ.15.40కు అందిస్తోంది.

ఎకరాకు 20 కిలోల విత్తనం..

పాడేరు డివిజన్‌లోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో వ్యవసాయశాఖ పంపిణీ చేపట్టింది. ఎకరాకు 20 కిలోల విత్తనం సరఫరా చేస్తున్నట్టు వ్యవసాయశాఖ తెలిపింది. గంజాయి సాగుకు దూరంగా ఉన్న మారుమూల ప్రాంతాల్లోని గిరి రైతులకు కూడా విత్తనాలు పంపిణీ చేయాలని వ్యవసాయశాఖకు పోలీసుశాఖ నివేదించింది.

పారదర్శకంగా పంపిణీ



ప్రభుత్వ ఆదేశాల మేరకు పాడేరు డివిజన్‌లోని ఆర్‌బీకే కేంద్రాల ద్వారా రాజ్‌మా విత్తనాల పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నాం .పారదర్శకంగా పంపిణీ చేపట్టాలని కలెక్టర్ నుంచి ఆదేశాలు అందాయి. పంపిణీలో మారుమూల గ్రామాల రైతులకు ప్రాధాన్యమిచ్చేలా ఆదేశాలిచ్చాం.

– ఎస్‌బీఎస్ నందు, జిల్లా వ్యవసాయాధికారి, పాడేరు

క్లుప్తంగా

క్రిమిసంహారక మందు తాగి వివాహిత ఆత్మహత్య


మృతి చెందిన సుభద్ర

మోతుగూడెం: స్థానిక పంచాయతీ ఇంతులూరి వాగు గ్రామంలో ఆదివారం ఓ వివాహిత మనస్తాపంతో క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. గ్రామానికి చెందిన భార్యాభర్తలు కిలో సుభద్ర (28), సోమనాథ్ గొడవపడ్డారు. దాంతో ఆమె మనస్తాపం చెంది ఈ దారుణానికి ఒడిగట్టింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చింతూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు.

జాతీయ జెండాలతో బైక్ ర్యాలీ

ముంచంగిపుట్టు: ఆంధ్ర, ఒడిశా సరిహద్దు ఒనకఢిల్లీలో బీఎస్ఎఫ్ 65 బెటాలియన్ ఆధ్వర్యంలో ఆజాదీకా అమృత్ మహోత్సవం భాగంగా ఆదివారం బీఎస్ఎఫ్ పోలీసులు జాతీయ జెండాలతో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఒనకఢిల్లీలో అన్ని వీధుల్లో భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. స్థానిక యువత సైతం ఈ ర్యాలీలో పాల్గొని దేశభక్తి చాటుకున్నారు. ప్రతి పల్లెలో స్వాతంత్య్ర దినోత్సవం రోజున జాతీయ జెండా ఎగరవేయాలని, ఎందరో త్యాగఫలం ఈరోజు మనం అనుభిస్తున్నామని బీఎస్ఎఫ్ 65 బెటాలియన్ కమాండెంట్ జగదీష్ ప్రసాద్ దళాయి అన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ ముఖేష్ కుమార్, మాచ్‌ఖండ్ ప్రాజెక్టు ఉద్యోగులు, స్థానిక యువకులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలు పెరిగే అవకాశం

- వందకు 68 మంది ఓటర్లు ఉండే విధంగా నమోదు ప్రక్రియ
- ఆదివాసీ(పీవీటీజీ) ఓట్లపై ప్రత్యేక దృష్టి సారించాలి
- బీఎల్వోల సమావేశంలో జేసీ శివ శ్రీనివాస్


సమావేశానికి హాజరైన బీఎల్వోలు

కొయ్యూరు: ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం 1,300 మంది ఓటర్లకు రెండు కిలోమీటర్ల మేర దూరంలో ఒక పోలింగ్ కేంద్రం ఉండాలని మన్యంలో ఇక్కడ పరిస్థితి భిన్నం కావడంతో దూరాన్ని తగ్గించే విధంగా వీటి సంఖ్యను పెంచేందుకు ప్రతిపాదిస్తామని జేసీ శివశ్రీనివాస్ వెల్లడించారు. ఆదివారం ఆయన కొయ్యూరులో తహసీల్దారు తిరుమలరావుతో కలిసి బీఎల్వోలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతీ వంద మందికి 68 మంది ఓటర్లు ఉండే విధంగా నమోదు చేస్తున్నామని, దీనిపై బీఎల్వోలకు ఇప్పటికే ఆదేశాలు ఇచ్చామన్నారు. 40 శాతం వికలాంగత్వం, లేదా 80 ఏళ్లు దాటిన వారు ఉంటే వారికి ఇంటి నుంచే ఓటు వేసే విధానాన్ని ప్రవేశ పెట్టే యోచనలో ఎన్నికల కమిషన్ ఉందన్నారు. ఈ నెల 21తో ఓటరు సర్వే పూర్తవుతుందన్నారు. 22 నుంచి పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణపై పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు. పీవీటీజీ (ఆదివాసీ) ఓట్ల నమోదుపై ప్రత్యేక దృష్టి సారించాలని బీఎల్‌వోలను ఆదేశించారు. ఇప్పటికే 18 వేల వరకు వారి ఓట్లను నమోదు చేశామన్నారు. కొయ్యూరులో వారి జనాభా 8,691 ఉంటే, నాలుగు వేల ఓట్లు మాత్రమే చేర్చారన్నారు. జనాభాకు అనుగుణంగా వారి ఓట్ల వివరాలు నమోదు కావలసి ఉందన్నారు. ఎన్నికల కమిషన్ ఓటర్ హెల్ప్ లైన్ యాప్‌ను తయారు చేసిందన్నారు. దానిలోనే 18 ఏళ్లు నిండిన వారు ఓటరుగా నమోదు చేసుకోవచ్చన్నారు. కొయ్యూరు మండలంలో 64 శాతం ఇంటింటి సర్వే పూర్తయిందని ఇక్కడ సిబ్బందిని, తహసీల్దారును ఆయన అభినందించారు. మర్రిపాలెం మహిళా డిగ్రీ కళాశాలలో ప్రత్యేక ఓటరు నమోదు ప్రక్రియను చేపట్టాలని ఆదేశించారు. ఒకే కుటుంబంలో ఉన్న వారు ఒకే పోలింగ్ కేంద్రంలో ఓట్లు వేసే విధంగా జాబితా తయారు చేస్తున్నామన్నారు.

తపాలా అధికారులతో మాట్లాడాలి

ఓట్ల గుర్తింపు కార్డులు (ఎపిక్) ఓటర్ల వద్దకు చేరుతున్నాయో లేదా బీఎల్‌వోలు, తహసీల్దారు విధిగా వారితో మాట్లాడాలని జేసీ తెలిపారు. తపాలా శాఖ ద్వారా బట్వాడా జరిగే వాటిని సకాలంలో ఓటర్లకు అందజేస్తున్నారో లేదో పర్యవేక్షణ చేయాలన్నారు. అవసరమైతే వారితో కలిసి పనిచేయాలని సూచించారు.

వెదురుకొమ్ములకు భలే గిరాకీ

అరకు-విశాఖ ప్రధాన రహదారిలో అమ్మకాలు


అరకు-విశాఖ ప్రధాన రహదారి కొత్తూరు సమీపంలో వెదురుకొమ్ములను విక్రయిస్తున్న గిరిజన మహిళ

అనంతగిరి: గిరిజనుల ఆచారాలు సంప్రదాయలతోపాటు వారి ఆహారపు అలవాట్లు విభిన్నంగానే ఉంటాయి. ప్రకృతితో మమేకమై జీవిస్తూ, అడవిలో దొరికే వాటినే ఆహారంగా స్వీకరిస్తూ రుచులను ఆస్వాదిస్తుంటారు. ప్రస్తుతం మన్యంలో దొరికే వెదురుకొమ్ముల కూరను రానురాను మైదాన ప్రాంతాల వాసులు లొట్టలేసుకుని మరీ ఇష్టంగా తింటున్నారు. ఇందులో అధిక పోషక విలువలు ఉండటంతోనే అంతగా ఇష్టపడుతున్నారు. దాంతో వెదురుకొమ్ములకు మంచి గిరాకీ పెరిగింది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో గిరిజన ప్రాంతంలో ఇవి అధిక సంఖ్యలో దొరుకుతుంటాయి. గిరిజనులు ఆహారం తీసుకోవడంతోపాటుగా మిగిలినవి అరకు-విశాఖ ప్రధాన రహదారిలో విక్రయిస్తూ ఆదాయం పొందుతున్నారు. మన్యం అందాలను తిలకించేందుకు వస్తున్న పర్యాటకులు వీటిని ఇష్టంగా కొనుగోలు చేస్తున్నారు. డముకు, టైడ, శివలింగపురం, కాశీపట్నం వరకు దారిపొడువునా వెదురుకొమ్ముల వాటా రూ.50 చొప్పున విక్రయిస్తున్నారు.

పాఠశాల స్వర్ణోత్సవాలను విజయవంతం చేయండి


అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న పూర్వ విద్యార్థులు


అల్లూరి సీతారామరాజు జెడ్పీ ఉన్నత పాఠశాల స్వర్ణోత్సవాల లోగోను ఆవిష్కరిస్తున్న దృశ్యం

రాజవొమ్మంగి: మండల కేంద్రంలో నవంబర్ 18, 19వ తేదీల్లో నిర్వహించే అల్లూరి సీతారామరాజు జెడ్పీ ఉన్నత పాఠశాల స్వర్ణోత్సవాలను విజయవంతం చేయాలని పూర్వ విద్యార్థులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆదివారం పాఠశాలలో సన్నాహక సమావేశానికి వారంతా హాజరయ్యారు. ఈ సందర్భంగా స్వర్ణోత్సవాల లోగో, బ్యానర్లు, వెబ్‌సైట్, గోడ పత్రికలను ఆవిష్కరించారు. 1966లో ఏర్పాటైన పాఠశాలలో చదివి ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా చదువు చెప్పిన గురువులకు, పాఠశాల రుణం తీర్చుకునేందుకు స్వర్ణోత్సవాలను ఘనంగా నిర్వహించాలని తీర్మానించారు. తొలుత పాఠశాల ఆవరణలో సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంతకు ముందు పూర్వ విద్యార్థులంతా కలసి భజంత్రీలతో పురవీధుల్లో ఊరేగారు. కరపత్రాలు పంపిణీ చేశారు. బుంగా రాజ్‌కుమార్, సర్వసిద్ధి నాగేంద్ర, రాధాకృష్ణ, చీడిపల్లి అప్పారావు, డి.శివరామచంద్రరాజు, రాష్ట్ర సివిల్ సప్లయిస్ డైరెక్టర్ జమ్మలమడక మణి (కాకినాడ), ప్రెస్ అకాడమీ సీఆర్ సంఘాని శ్రీనివాస్ జీవన్, పైడా కాలేజీ ప్రిన్సిపాల్ ప్రకాష్, రిటైర్డ్ ఫారెస్ట్ రేంజ్ అధికారి రాళ్లపల్లి విఘ్నేశ్వర్రావు, ముదునూరి సూర్యనారాయణ రాజు, వేటూరి సత్యప్రభాకర్ తదితర పూర్వ విద్యార్థులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

నేడు కల్యాణపులోవ నీరు విడుదల


రిజర్వాయర్‌లో ఉన్న నీరు

రావికమతం: కల్యాణపులోవ రిజర్వాయర్ నీటిని ఆయకట్టు రైతుల కోరిక మేరకు సోమవారం ఉదయం విడుదల చేయనున్నారు. ప్రభుత్వ విప్, చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ చేతుల మీదుగా విడుదల చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. 460 అడుగుల సామర్థ్యం గల కల్యాణపులోవ రిజర్వాయర్‌లో ప్రస్తుతం 452 అడుగుల నీరుందని ఇరిగేషన్ కొత్తకోట సెక్షన్ ఏఈ సత్యనారాయణ దొర ఆదివారం తెలిపారు. ఆయకట్టుకు ప్రధాన కాలువ ద్వారా రోజుకు 30 క్యూసెక్కుల చొప్పున 50 రోజుల పాటు విడుదల చేయాలన్నారు. ఇందుకు ప్రస్తుతం ఉన్న నీరు సరిపోతుందని చెప్పారు. ఎండలు విపరీతంగా కాస్తుండటం, నారుమడులు ఎండిపోతున్న దృష్ట్యా రైతులు నీటిని పొదుపుగా వాడుకోవాలని ఆయన సూచించారు.

నేడు మినీ జాబ్‌మేళా

అనకాపల్లిటౌన్: మండలంలోని రేబాక పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం ఉదయం 9 గంటలకు మినీ జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి టి.చాముండేశ్వరరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, ఐటీఐలో ఉత్తీర్ణత సాధించి 18 నుంచి 40 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన నిరుద్యోగ యువతీయువకులు జాబ్‌మేళాలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 8309561123, 7036363272 అనే ఫోన్ నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Education

ONE SITTING
■ One Sitting : 10th, Inter, Degree (All), PG (All), BBA, BCA, MBA, MCA, Dip. Engg., B.Tech, M.Tech, Dip. VET, Nursing, Pharmachy, B.Ed, Ph.D from Govt. Recog. Univs. Ph : 83417 74299 [V- 794478]

Real Estate

R/E WANTED
■ సైట్ లీజ్‌కు కావలెను. (MNC కంపెనీ) కొరకు రోడ్ ఫేసింగ్ 40 సెంట్లు నుండి 1 ఎకరాం వరకు. శ్రీకాకుళం, వైజాగ్, విజయనగరం జిల్లాలు. ఫోన్ : 98483 26807 [V-10972]

RENT / SALE
■ NAD జంక్షన్, శాంతినగర్. 3150 Sq.Feet (or) 1495 Sq.Feet. గ్రౌండ్‌ఫ్లోర్, కమర్షియల్ ప్లాట్ సేల్‌కి లేదా అద్దెకు కలదు. సంప్రదించండి : 90102 45443, 94944 02045 [V- 2651]

WANTED LAND
■ ప్రముఖ విద్యాసంస్థకు మధురవాడ, కొమ్మాది, తగరపువలస ఏరియాలో ఎకరం 10 సెంట్లు స్థలము ఉండి 40,000/- Sft, బిల్డింగ్ కట్టి అద్దెకు ఇచ్చుటకు ఆసక్తి గలవారు సంప్ర : 94924 32299 [V-794591]

Services

GOLD LOANS
■ లోకేష్ గోల్డ్ లోన్స్ :- బ్యాంక్/ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదే రోజు మార్కెట్ రేటుకు కొనబడును. సంప్ర :- 98484 88068/ 77992 23300 [V- 10745]
■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) 100% జెన్యూన్. ✆ 76508 91999 [B-788204]
■ బంగారం బ్యాంకులలో, ఇతర సంస్థలలో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం అధిక ధరకు కొనబడును. స్పాట్ క్యాష్. సంప్ర॥ ✆ 99481 66555 [B-1193214]

MARRIAGE SERVICES
■ క్రైస్తవ, హిందూ, మాలల వివాహ పరిచయ వేదిక. తేది: 15-08-2023 సా. 5 గం. నుండి రా. 8గం. వరకు. పబ్లిక్ లైబ్రరి, B.V.K. కాలేజి వద్ద, ద్వారకానగర్, విశాఖపట్నం ✆ 94412 41468 [B-788151]

SEPTIC TANK CLEAN
■ సుధాకర్ సెప్టిక్ ట్యాంక్ క్లీనర్స్ హైటెక్ మిషన్‌తో అతితక్కువ ఖర్చుతో ఇరుగుపొరుగు వారికి ఎటువంటి దుర్వాసన లేకుండా 10 ని॥ల్లో క్లీన్ చేయబడును. ఫోన్ : 98488 06516, 90149 03518 [V-2078]

Wanted

■ NAD ప్రముఖ విద్యా సంస్థలో 2 సం॥ అనుభవం ఉన్న 25 to 35 years Lady Coordinator కావలెను. అర్హత : డిగ్రీ. CV Send : abcindia729@gmail.com ఫోన్ : 97010 39939 [V- 797263]
■ న్యూ బ్రాంచ్ ఆఫీస్‌లో టీం లీడర్స్, రిటైర్డ్, గృహిణులు, స్టూడెంట్స్, నిరుద్యోగులు, అర్జెంటు జాయిన్. P/T : 18,500/-, F/F : 23,500/-. ఫోన్ : 90149 87064 [V- 794688]
■ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ నందు దిగువ బ్రాంచ్‌లో పనిచేయుటకు యువతీ / యువకులు కావలెను. ద్వారకానగర్, MVP, మహారాణిపేట, మధురవాడ, NAD, పెందుర్తి, కొత్తవలస ఏరియాలో రికవరి మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్, ఆఫీస్ స్టాఫ్ కావలెను. అర్హత : డిగ్రీ పాస్, వయస్సు : 28 సం॥లోపు. సంప్ర : 89783 80138, 90004 04176 [V- 11666]
■ మీ మొబైల్ ద్వారా మా కంపెనీ అడ్వర్టైజ్‌మెంట్ పంపుతూ వారం వారం అధిక ఆదాయం పొందండి. మీ అడ్రస్ వాట్సప్ చేయండి. వివరాలకు కాల్ చేయండి. 95736 33520, 90596 33520. [M-1221515]
■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ: 18K, ఏజెంట్ కమీషన్ 3K ఫోన్ : 9848571888 [HA-502]
■ MS కంపెనీ నందు ఇంటి నుంచి పార్ట్‌టైమ్ /ఫుల్ టైమ్ వర్క్ చేయుటకు టెలికాలర్స్ కావలెను. మేల్/ఫిమేల్, Qly:10th, జీతం: 16,000 -18,000 Ph: 9989923178/ 7075227337 [HA-498]

www.sakshi.com

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి క్లాసిఫైడ్స్ లలితానగర్, అక్కయ్యపాలెం, విశాఖపట్నం - 16.

అనకాపల్లి : 9010546644
యలమంచిలి : 9951602901
చోడవరం : 9010210265
నర్సీపట్నం : 9010234557
పాడేరు : 9010973030

విశాఖపట్నం, అనకాపల్లి + అల్లూరి జిల్లా
నాలుగు లైన్లు రూ.475/-
అదనపు లైను రూ.100/-
+ 5% జి.ఎస్.టి. అదనం

మత్తులో యువకుల హల్‌చల్

- ప్రజలను భయాందోళనలకు గురిచేస్తున్న జులాయిలు
- హడలెత్తిపోతున్న దేవరాపల్లి ప్రజానీకం
- ఒకరిని పట్టుకొని పోలీసులకు అప్పగించిన స్థానికులు
- నలుగురిపై సస్పెక్ట్ షీట్ ఓపెన్ చేస్తామని ఎస్ఐ నాగేంద్ర వెల్లడి


రాత్రి పది గంటల ప్రాంతంలో పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్న దేవరాపల్లి గ్రామ ప్రజలు

దేవరాపల్లి: కొందరు యువకులు మత్తు పానియాలకు బానిసై ప్రజలను తీవ్ర భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. గంజాయి, మద్యం సేవిస్తూ ఆ మత్తులో రాత్రి, పగలు తేడా లేకుండా గ్రామంలో హల్‌చల్ చేస్తూ దాడులకు పాల్పడుతూ ప్రజలను భయాందోళనలకు గురిచేస్తున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే చంపేస్తామంటూ బెదిరిస్తూ జనానికి కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నారు. రాత్రి పూట ఇంటి నుండి బయటకు రావాలంటే మహిళలు హడలెత్తిపోతున్నారు. ఇటీవల దేవరాపల్లి-వాలాబు రహదారిలో కొబ్బరి తోట వద్ద అటుగా వెళ్తున్న ఆటోను అడ్డగించి ఆటోలో ఉన్న వ్యక్తులపై దాడికి పాల్పడినట్టు స్థానికులు తెలిపారు. ముఠాగా ఏర్పడిన జులాయిలు సమీపంలోని పలు షాపుల యజమానులపై సైతం దాడికి తెగబడినట్టు చెబుతున్నారు. వీరి దౌర్జన్యాలకు భయపడి ఫిర్యాదు చేసేందుకు ఎవరూ సాహసించలేకపోయారు. అయితే వీరి ఆగడాలు రోజురోజుకు పెచ్చుమీరడంతో విసిగి వేసారిన జనం శనివారం రాత్రి తిరగబడ్డారు. సుమారు 200 మందికి పైగా జనం రోడ్లపైకి వచ్చి మత్తులో ఉన్న జులాయిని పట్టుకొని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. వీరి నుండి తమకు ప్రాణహాని ఉందని రక్షణ కల్పించాలంటూ శనివారం రాత్రి మహిళలు సైతం పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని పోలీసుల ఎదుట మొర పెట్టుకున్నారు. వీరి దుశ్చర్యలపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ప్రజలంతా మూకుమ్మడిగా లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ విషయాన్ని స్థానిక ఎస్ఐ డి. నాగేంద్ర వద్ద ప్రస్తావించగా స్థానికుల ఫిర్యాదు మేరకు సదరు నలుగురు యువకులపై సస్పెక్ట్ షీట్ ఓపెన్ చేసి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేస్తామని తెలిపారు.

మారుతీనగర్‌లో చోరీ

3 తులాల బంగారు నగలు, రూ.1.10 లక్షల నగదు అపహరణ


దొంగలు తెరచిన ఇనుప బీరువా

చోడవరం రూరల్: పట్టణం సమీపంలోని గాంధీ గ్రామం పంచాయతీ మారుతీనగర్‌లోని బాలికల వసతిగృహం నైట్ వాచ్‌ఉమెన్ ఇంట్లో శనివారం రాత్రి చోరీ జరిగింది. ఈ ఘటనలో మూడు తులాల బంగారు నగలు, రూ.1.10లక్షల నగదును దొంగలు అపహరించుకు పోయారు. బాధితురాలు గొల్లమాలి దేవి కథనం ప్రకారం బాలికల హాస్టల్‌లో వాచ్‌ఉమెన్‌గా చేస్తున్న ఆమె తన కుమారుడు నానాజీతో కలిసి మారుతీనగర్‌లో బి.ఎన్ రోడ్డును ఆనుకుని ఉన్న ఆంజనేయస్వామి గుడి వెనుక ఉన్న అద్దె ఇంట్లో నివాసం ఉంటుంది. శనివారం రాత్రి ఆమె హాస్టల్లో విధులకు వెళ్లగా తన కుమారుడు ఉక్కపోత కారణంగా ఇంటి తలుపు గడియపెట్టి, మేడపైకి వెళ్లి నిద్రపోయాడు. ఆదివారం ఉదయం లేచి ఇంట్లోకి వెళ్లి చూసే సరికి ఇనుప బీరువా తెరచి ఉండి అందులోని బట్టలు చిందర వందరగా, మంచంపైనా పడవేసి ఉన్నాయి. ఇది చూసిన నానాజీ తన తల్లి దేవికి సమాచారం అందించాడు. ఆమె వచ్చి చూసుకునే సరికి బీరువాలో బంగారు వస్తువులు, నగదు దొంగలపాలైనట్టు గుర్తించి చోడవరం పోలీసులను ఆశ్రయించింది. ఎస్ఐ బి.అప్పలనాయుడు కేసు దర్యాప్తు చేపట్టారు. అనకాపల్లి నుంచి క్లూస్ టీంను రప్పించి వేలిముద్రలు సేకరించారు.

దివ్యాంగులకు వాహన యోగం

- జిల్లాలో 129 మంది అర్హులు
- తొలి విడతలో నియోజకవర్గానికి 10 మందికి చొప్పున పంపిణీ


దివ్యాంగులకు అందజేయనున్న స్కూటీలు

అచ్యుతాపురం(అనకాపల్లి): రాష్ట్రంలో అన్ని వర్గాలకు న్యాయం చేయడమే లక్ష్యంగా పథకాలు అమలవుతున్నాయి. ఆపన్నులకు అండగా నిలుస్తున్న రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు వాహనయోగం కల్పిస్తోంది. పూర్తి సబ్సిడీపై వాహనాలు అందిస్తూ వారికి అండగా నిలుస్తోంది. రెండు చేతులు ఉండి, స్వయంగా వాహనం నడపగల దివ్యాంగులకు ప్రభుత్వం స్కూటీలను అందజేస్తోంది. దీనికి గానూ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించింది. రూ.లక్ష పైబడి విలువ ఉన్న స్కూటీలను శతశాతం సబ్సిడీపై ఉచితంగా ఇస్తోంది. పదవ తరగతి చదివి, త్రిచక్ర వాహనం నడపగలిగిన కలిగిన వారికి మంజూరు చేయనున్నారు. దీంతో దివ్యాంగుల్లో హర్షం వ్యక్తం అవుతోంది. ఇప్పటికే వికలాంగ పింఛన్లు, రుణాలు అందిస్తున్న ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమానికి మరిన్ని చర్యలు తీసుకుంటోంది.

జిల్లాలో 129 మంది అర్హులు

జిల్లాలో మొత్తం 23 వేల మంది దివ్యాంగులున్నారు. వీరిలో ఏడు వేల మంది శారీరక వైకల్యం కలిగిన వారు. వీరిలో స్కూటీల కోసం ఆన్‌లైన్లో సుమారు 200 మంది దరఖాస్తు చేసుకోగా 129 మందిని అర్హులుగా ఎంపిక చేశారు. మొదటి విడతలో 70 మందికి వాహనాలను అందించనున్నారు. నియోజకవర్గానికి పది చొప్పున తొలివిడత అందిస్తున్నారు.

జనసేన సైనికుల్లో కుమ్ములాట

- ఫ్లెక్సీల విషయంలో రెండు వర్గాల మధ్య తోపులాట
- విజయకుమార్ కటౌట్లను తీయించి వేసిన పరుచూరి భాస్కరరావు వర్గీయులు


కటౌట్లను చించేసి తొలగిస్తున్న దృశ్యం

సాక్షి, అనకాపల్లి: కటౌట్ల విషయంలో జనసైనికులు ఆదివారం కుమ్ములాడుకున్నారు. అనకాపల్లి జనసేన ఇన్‌చార్జి, రాష్ట్ర అధికార ప్రతినిధి పరుచూరి భాస్కరరావు, యలమంచిలి నియోజకవర్గ ఇన్‌చార్జి సుందరపు విజయకుమార్‌ల మధ్య విభేదాలు ఆ పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ పర్యటన నేపథ్యంలో మరోసారి బయట పడ్డాయి. అధినేత వద్ద ఎక్కువ మార్కులు కొట్టేద్దామనే పనిలో ఇద్దరూ ఉండడం.. ఇద్దరూ పవన్‌కు సన్నిహితంగా ఉండడంతో వారి మధ్య ఆధిపత్యపోరు జరుగుతోంది. అనకాపల్లి పూడిమడక రోడ్డులో జాతీయ రహదారికి ఆనుకున్న భాస్కరరావు కార్యాలయం సమీపంలో విజయకుమార్ కటౌట్‌లను ఏర్పాటు చేశారు. దీంతో తమ ప్రాంతంలో కటౌట్లు ఎలా పెడతారని తమ వర్గీయులతో పరుచూరి భాస్కరరావు వాటిని చింపివేయించారు. ఈ సందర్భంగా సుందరపు విజయకుమార్ వర్గీయులు, భాస్కరరావు వర్గీయుల మధ్య వాగ్వాదం, తోపులాట జరిగింది. సుమారు గంట పాటు వీరు గొడవపడ్డారు. చివరికి విజయకుమార్ కటౌట్లను పూర్తిగా చించి, తీసివేశారు. అసలే జనసేన పార్టీ పరిస్థితి బాగోలేదు. ఈసారి కూడా చంద్రబాబుకు తన అధినేత కొమ్ముకాయడం నచ్చని జనసైనికులు ఇప్పటివరకూ అంటీముట్టనట్లుగా ఉంటున్నారు. గ్రామాల్లో రోజు రోజుకూ జనసేన గ్రాఫ్ అత్యంత కింది స్థాయికి పడిపోతుండడంతో పవన్ అభిమానుల్లో ఆశలు సన్నగిల్లుతున్నాయి. వారాహి యాత్రలో భాగంగా అనకాపల్లి నియోజకవర్గం కశింకోట మండలంలో విసన్నపేటలో భూములు పరిశీలించడానికి సోమవారం పవన్ కల్యాణ్ రానున్నారు. ఈ నేపథ్యంలో విభేదాలు చోటు చేసుకోవడం.. కేడర్ నిరుత్సాహానికి గురైంది.

వల నిండింది.. పంట పండింది

- భారీగా దొరుకుతున్న రొయ్యలు, చేపలు
- తాండవ నీటి విడుదలే కారణమంటున్న జాలర్లు


జాలర్ల వలకు చిక్కిన 18 కిలోల చేప


జలాశయంలో మత్స్య వేటలో జాలర్లు

గొలుగొండ: ఆదివారం వస్తే చాలు.. మాంసాహార ప్రియులకు పండగే. అందులోనూ తాండవ చేపలు, రొయ్యలంటే మరింత ఇష్టం. సుమారు 2,400 ఎకరాల్లో విస్తరించి ఉన్న తాండవ జలాశయంలో సహజంగా దొరికే నాచు, గడ్డి తిని పెరిగే రొయ్యలు, చేపలకు కాస్త రుచి ఎక్కువని స్థానికులు చెప్తుంటారు. స్థానిక జాలర్లకు ఆదివారం భారీగా రొయ్యలు, చేపలు దొరికాయి. వీటికి గొలుగొండ, జోగుంపేట సంతలో మంచి డిమాండ్ ఏర్పడింది. మార్కెట్‌కు చేరిన తాండవ జలాశయ చేపలు, రొయ్యలు వచ్చినవి వచ్చినట్లే అమ్ముడుపోయాయి.

నాలుగు రోజుల నుంచి వేట అదుర్స్

ప్రస్తుతం తాండవ జలాశయం నుంచి సాగునీటిని విడిచిపెట్టారు. గత నాలుగైదు రోజులుగా వర్షాల్లేక, ఎండలు కూడా బాగా ఉండటంతో జాలర్లకు చేపలు, రొయ్యల పంట పండింది. నాలుగు రోజుల నుంచి జలాశయంలో చేపలు, రొయ్యల వేట జోరుగా సాగుతోంది. జలాశయానికి గొలుగొండ మండలంలోని బొడ్డేరు, దారగెడ్డలు ప్రధాన ఆధారం. వారం పది రోజుల నుంచి వర్షాల్లేక ఈ గెడ్డల నుంచి చుక్క నీరు రావట్లేదు. దీనికి తోడు పంట భూములకు నీరు వదలడంతో నీటి మట్టం కదలికలు, ఉష్ణోగ్రతల్లో వ్యత్యాసం వల్ల అడుగున ఉన్న చేపలు బయటకు వచ్చి, జాలర్ల వలకు చిక్కుతున్నాయి. ఏటా ఫిబ్రవరి రెండోవారం నుంచి జూలై వరకు మాత్రమే రొయ్యల వేట సాగుతుంది. ఆగస్టులో భారీ వర్షాలు ఉండటం వలన రొయ్యల వేట నిలిపేసేవారు. నీరు పెరిగినపుడు రొయ్యలు వలకు చిక్కడం చాలా తక్కువ. నీటి మట్టం తగ్గడంతో చేపలతో పాటు రొయ్యలు అధికంగా పడుతున్నాయి.

2 నుంచి 18 కిలోల బరువు

తాండవ జలాశయంలో ప్రస్తుతం రెండు కిలోల నుండి 18 కిలోల బరువున్న చేపలు పడుతున్నాయి. ఈ జలాశయంపై ఆధారపడి గొలుగొండ మండలంలో పాగచెట్లపాలెం, వెంకటాపురం, సాలికమల్లవరం, జోగుంపేట, గొలుగొండ, అమ్మపేట, జాలారు, విప్పలపాలెం, గాదంపాలెంతో పాటు నాతవరం మండలంలో మరో నాలుగు గ్రామాల జాలర్లు ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ప్రస్తుతం నీటిని దిగువకు విడిచిపెట్టడంతో వందలాది మంది జాలర్లు జలాశయంలో వేట సాగిస్తున్నారు. ప్రస్తుతం చేపల వేటతోపాటు రొయ్యలు కూడా జాలర్లకు అధికంగా దొరుకుతున్నాయి. రొయ్యలు ఇక్కడి మార్కెట్లో కిలో రూ.250, చేపలు కిలో రూ.150 చొప్పున అమ్మకాలు జరుగుతున్నాయి.


అధికంగా పడిన రొయ్యలు

లాభాల వేట



నాలుగు రోజుల నుంచి వేట జోరుగా సాగుతోంది. ప్రస్తుతం తాండవ జలాశయంలో రొయ్యలు, చేపలు అధికంగా వలలకు చిక్కుతున్నాయి. వాటిని పట్టుకునేందుకు పోటీ పడుతున్నాం. మార్కెట్లో తాండవ చేపలు, రొయ్యలకున్న డిమాండ్ కూడా కాస్త కలిసొస్తోంది.

–దేముడు, జాలరి, వెంకటాపురం

డీఆర్‌వోగా అనిత

నేటి నుంచి పూర్తిస్థాయిలో బాధ్యతల నిర్వహణ



సాక్షి, అనకాపల్లి: జిల్లా రెవెన్యూ అధికారి(డీఆర్‌వో)గా అనిత నియమితులయ్యారు. ఇప్పటి వరకు డీఆర్‌వోగా పనిచేసిన వెంకట రమణ దీర్ఘకాలిక సెలవు పెట్టడంతో ఆయన స్థానంలో ఏపీఐఐసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనితకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ కలెక్టర్ రవి పట్టాన్ శెట్టి ఉత్తర్వులు జారీ చేశారు. ఆమె సోమవారం నుంచి పూర్తి స్థాయిలో బాధ్యతలు నిర్వహించనున్నారు. శుక్రవారం డీఆర్‌వో వెంకట రమణ సెలవు పెట్టడంతో..ఓటరు సర్వే ప్రక్రియ పర్యవేక్షణ బాధ్యతను ఇన్‌చార్జి డీఆర్‌వోగా ఏపీఐఐసీ ఎస్‌డీసీ అనితకు అప్పగించారు. శనివారం, ఆదివారం సెలవులు కావడంతో ఆమె సోమవారం నుంచి పూర్తి అదనపు బాధ్యతలు చేపట్టనున్నారు.